25న ఓటర్ల అవగాహనా ర్యాలీ: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్‌డిఒ దాసి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరంలోని బివి రాజు కళాశాల ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మోటార్ సైకిల్ ఉన్నవారు ఈ ర్యాలీలో పాల్గొనవచ్చని తెలిపారు. అనంతరం బి.వి.రాజు కళాశాల సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 24న భీమవరం రాయలం రోడ్డులోని పద్మాలయ థియేటర్ సమీపంలో జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

108 ఉద్యోగులకు భద్రత ఏదీ..!

- సిఎం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరని దుస్థితి
- 12 గంటల పని విధానంతో తీవ్ర ఇబ్బందులు
- చిన్నచిన్న కారణాలతో ఉద్యోగులపై వేటు
- ఉద్యోగులు మృతి చెందినా పట్టని పరిస్థితి
- సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మెకు సిద్ధమంటూ సిబ్బంది హెచ్చరిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కష్టం వస్తే క్షణాల్లో వాలిపోతారు. ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించేందుకు తమ సర్వశక్తులూ ఒడ్డుతారు. రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తారు. ఆపద సమయంలో అందరికీ అండగా ఉండే 108 ఉద్యోగుల బతుకులకు మాత్రం భద్రత లేకుండాపోయింది. మిమ్మల్ని ఆదుకుంటామని సిఎం ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయకపోవడం, చిన్నచిన్న కారణాలకే ఉద్యోగం నుంచి తొలగింపు వంటి అనేక సమస్యలతో 108 అంబులెన్స్ ఉద్యోగులు సతమతమవుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మెకైనా సిద్ధమని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.'

ఆపద వస్తే ఆగమేఘాల మీద మన వద్దకు వచ్చే 108 అంబులెన్స్‌ల గురించి అందరికీ తెలిసిందే. అయితే ఆ 108 వాహనాల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల కష్టాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50 వరకూ 108 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఈ వాహనాల్లో 120 మంది పైలెట్ (డ్రైవర్లు)లు, 130 మంది ఇఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్)లు మొత్తం 250 మంది పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య వేలల్లో ఉంది. ప్రతిరోజూ ఎంతోమంది ప్రజల ప్రాణాలను కాపాడటంలో అంబులెన్స్ ఉద్యోగుల పాత్ర ఎనలేనిది. అత్యవసర విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేకుండాపోయింది. 108 ఉద్యోగులకు భద్రత కల్పిస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచినా ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇప్పటికీ అంబులెన్స్ ఉద్యోగులంతా ఏజెన్సీ పరిధిలోనే పని చేస్తున్నారు. నేరుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికీ 108 ఉద్యోగులకు 12 గంటల పని విధానం అమలవుతోంది. ఒక్కోసారి 14 గంటలు సైతం పని చేయాల్సి వస్తోంది. దీంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఏదైనా కారణంతో 108 వాహనం ప్రమాదానికి గురైతే విధుల నుంచి తొలగించడం వంటి చర్యలు చేపడుతూ మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఒకటే సస్పెన్షన్ చేస్తే ఎన్ని రోజులు అనేది చెప్పని పరిస్థితులు ఉన్నాయి. సస్పెన్షన్ కాలంలో కార్మిక చట్టాలకు అనుగుణంగా వేతనాలు కూడా అమలు చేయకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. 108 ఉద్యోగులు మరణిస్తే ఉద్యోగి కుటుంబాన్ని నడిరోడ్డుపై వదిలేస్తున్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి సరైన చర్యలు తీసుకోకపోవడం ఉద్యోగులను తీవ్రంగా కలిచివేస్తోంది. అంబులెన్స్ ఉద్యోగులకు ప్రతియేటా వేతన పెంపును అమలు చేయాలని ఉద్యోగులు కోరుతున్నా ఎటువంటి చర్యలూ లేకుండాపోయాయి. వాహనాలు సరైన కండీషన్‌లో లేకపోవడంతో ఒక్కోసారి సమయానికి వెళ్లలేని పరిస్థితులు నెలకొనడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు కండీషన్‌లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ నియామకాల్లో విద్యార్హత, ప్రమాణాలు కలిగిన 108 ఉద్యోగులకు సర్వీస్‌ను బట్టి వెయిటేజీ మార్కులు అందించాలని సైతం వారంతా కోరుతున్నారు. ఆంబులెన్స్ ఉద్యోగులుగా 17 ఏళ్లుగా పని చేస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారంతా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. అందరికీ ఆపదలో అండగా నిలిచే 108 ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

సమస్యలు తీర్చకుంటే సమ్మెకైనా సిద్ధం

తాము ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని సోమవారం 108 ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కరించకపోతే ఏ క్షణంలోనైనా సమ్మెకు సిద్ధమని ఆంబులెన్స్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తే బాగుంటుందని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మృత్యుంజయరావు, నేత ఎన్.దినేష్, జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రమేష్, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసిస్తున్న 108 ఉద్యోగులు

కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టండి

25న ఉపాధ్యాయ సంఘాలకు మద్దతుగా నిరసన - ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టాలని, లేనిపక్షంలో బుధవారం ఏలూరు విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాలకు మద్దతుగా ప్రత్యక్ష నిరసన చేపట్టనున్నట్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న సర్‌ప్లస్ ఉపాధ్యాయులను సర్దుబాటులో భాగంగా సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారని, అయితే ఈ జిల్లాలో అందుకు భిన్నంగా ఉపాధ్యాయులను యథేచ్ఛగా సుదూర ప్రాంతాలకు బదిలీలు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా మాదిరిగా పశ్చిమగోదావరి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు కూడా కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని కోరినా ఎటువంటి ప్రయోజనమూ లేకుండాపోయింది. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే బుధవారం ఉపాధ్యాయ సంఘాలకు మద్దతుగా ప్రత్యక్ష నిరసన చేపడతామని సాబ్జీ స్పష్టం చేశారు.

స్పందన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం

అర్జీలను త్వరితగతిన పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా జిల్లా, మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన ఫిర్యాదు పరిష్కరించేటప్పుడు ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఫొటో అప్‌లోడ్ చేయాలని, సమస్య పరిష్కారం కాకముందు ఉన్న ఫొటో, పరిష్కారమైన తర్వాత ఫొటో అప్‌లోడ్ చేయకపోతే దరఖాస్తు పరిష్కరించినట్లు కాదని స్పష్టం చేశారు. ఈ స్పందన కార్యక్రమంలో 85 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో స్పందన పోర్టల్‌లో చేసుకున్న దరఖాస్తును 24 గంటల్లోగా ఓపెన్ చేసి సంబంధిత శాఖకు సంబంధించినది అయితే ఓకే బటన్ క్లిక్ చేయాలని, వేరే శాఖకు సంబంధించినదైతే సంబంధిత ఎండార్స్‌మెంట్‌తో వెనుకకు కొట్టాలని కలెక్టర్ సూచించారు. 24 గంటల్లోగా ఆ దరఖాస్తును సంబంధిత అధికారి ఓపెన్ చేసి చూడకపోతే సిఎంఒ కార్యాలయం నుండి నేరుగా జిల్లా కలెక్టరుకుగాని, సంబంధిత శాఖాధికారులకుగాని ఫోన్ వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిఎస్‌డబ్ల్యూఎ కెసిహెచ్.అప్పారావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

త్వరితగతిన స్పందన ఫిర్యాదుల పరిష్కారం

ఎస్‌పి యు.రవిప్రకాష్

భీమవరం రూరల్: స్పందనలో వచ్చిన ఫిర్యాదులకు వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ అన్నారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి పది ఫిర్యాదులు అందాయన్నారు.

మహోన్నత వ్యక్తి సుభాష్ చంద్రబోస్

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, త్యాగశీలి, మహోన్నతుడు సుభాష్‌చంద్రబోస్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక సుందరయ్య భవనం వద్ద బోస్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి బలరాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించినవారిలో సుబాష్ చంద్రబోస్ ఒకరన్నారు. బ్రిటీష్ పాలన నుండి దేశం విముక్తి కావాలని, సామ్రాజ్యవాద దోపిడీ అంతం కావాలని కలలు కన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ సుభాష్ చంద్రబోస్ కలలు కన్న రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని నాశనం చేస్తోందన్నారు. మరోపక్క బోస్‌ను కీర్తించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నేతలు

నాట్లు వేసిన ఎస్‌బిఐ మేనేజర్

ప్రజాశక్తి - పోడూరు

రుణాల రికవరీ కోసం వెళ్తున్న బ్యాంకు మేనేజర్ రోడ్డు పక్క పొలాల్లో కూలీలతో కలిసి వరినాట్లు వేయడం అందరినీ ఆశ్చర్యపర్చింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుమ్ములూరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ విజయ్ సింహ సోమవారం రుణాల రికవరీ కోసం గ్రామంలోకి వెళ్లారు. ఆ క్రమంలో రోడ్డు పక్కనే వరి చేలో కూలీలు నాట్లు వేయడం చూసి ఆగారు. కొద్దిసేపు పరిశీలన అనంతరం ఆయనే స్వయంగా చేలోకి దిగి కూలీలతో పాటు నాట్లు వేశారు. సుమారు గంటసేపు ఆయన రైతు కూలీ తరహాలో నాట్లు వేసి కూలీలతో మమేకమయ్యారు.

నాట్లు వేస్తున్న ఎస్‌బిఐ మేనేజర్ విజయసింహ

ద్విచక్ర వాహనదారునికి హెల్మెట్ తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ద్విచక్ర వాహనం నడిపే వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని వారు మృత్యువాత పడుతూ వారి కుటుంబాలను విషాదంలోకి నెట్టేస్తున్నారని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ అన్నారు. జాతీయ భద్రత వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక కేశవరావు హైస్కూల్ వద్ద నుండి హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో 65 శాతం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించక ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ర్యాలీని ఎఎస్‌పి ఎ.సుబ్బరాజు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఎస్‌పి రవిప్రకాష్, డిఎస్‌పి శ్రీధర్ పాల్గొన్నారు. ర్యాలీ కొత్త బస్టాండ్ నుండి ప్రకాశం చౌక్ మీదుగా టూటౌన్‌లోని జువ్వలపాలెం రోడ్డు మీదుగా ఎస్ఆర్‌కెఆర్ కళాశాల వరకు సాగింది. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి యు.ఉమామహేశ్వరరావు, సిఐలు, ఎస్ఐలు, రవాణా శాఖాధికారులు, పలు కళాశాల విద్యార్థులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఎస్‌పి రవిప్రకాష్

వెట్టిచాకిరీ చేయలేకపోతున్నాం

మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పాలకోడేరు

చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరీ చేయలేకపోతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోయారు. ఎన్నోఏళ్ల నుంచి వేధిస్తున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు మాట్లాడుతూ ఎన్నోఏళ్ల నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్నా తమకు కేవలం రూ.మూడు వేలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం అందిస్తున్న వేతనం సరిపోక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ప్రభుత్వం అందిస్తున్న వేతనాన్ని నిర్వాహకులు పంచుకున్న సందర్భంలో ఒక్కొక్కరికి రూ.వెయ్యి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న తమ సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి దున్న మరియమ్మ, సిఐటియు మండల నాయకులు వైఎస్ఎన్.మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అసిరియ్య, కార్మికులు సుందరమ్మ, నూకరత్నం, సునీత, పెద్దింట్లమ్మ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వాలంటీర్లు బేస్‌లైన్ సర్వే కచ్చితంగా చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

వాలంటీర్లు బేస్‌లైన్ సర్వే కచ్చితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పూర్తి అవగాహనతో పని చేయాలన్నారు. డేటా రూపొందించేటప్పుడు వాలంటీర్ బేస్ లైన్ సర్వే ఆధారంగా డేటా సుస్థిరంగా ఉండాలని సూచించారు. నవరత్నాలతో లింక్ అయిన ఇండికేటర్స్ డేటా ఎస్‌డిజి వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్, ఎడ్యుకేషన్, లా అండ్ ఆర్డర్ ఉన్నాయని, వీటి ద్వారా అమలు చేసే వివిధ పథకాలు పూర్తిస్థాయిలో ఎస్‌డిజి వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. బడిఈడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో రక్తహీనతకు గురికాకుండా ఎప్పటికప్పుడు వారికి పౌష్టికాహారం అందించడంతోపాటు సంబంధిత మందులను రోజుకు రెండుసార్లు చొప్పున అందజేసేలా చూడాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించిన రక్త పరీక్షల వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, ప్రతినెలా హెచ్చుతగ్గులను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఒ కె.శ్రీనివాసరావు, జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్‌వి.రమణ, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, ఎఎస్‌ఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చించినాడ లంక భూముల పరిశీలన

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడలో పేదల ఆధీనంలో ఉన్న ఇసుక లంకలను సోమవారం సబ్ కలెక్టర్ సూర్యతేజ పరిశీలించారు. ఈ సందర్భంగా పేదల తరపున కొందరు నాయకులు మాట్లాడుతూ గత 20 ఏళ్లకుపైగా డి.ఫారం పట్టా భూముల కింద గోదావరి పెంచిన పెరుగు లంక భూములను పేదలు సమిష్టిగా సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే ఈ లంక మట్టిని తవ్వి పోడూరు మండలంలో జగనన్న కాలనీలను పూడ్చేందుకు గృహనిర్మాణ శాఖాధికారులు ప్రయత్నిస్తున్నారని, అలా చేయడం వల్ల పేదలు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ఈ భూముల నుండి మట్టిని బయటికి తరలించకుండా చూడాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు కేతా సూర్యారావు, కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండలు, చెల్లుబోయిన వడ్డీకాసులు, తెన్నేటి స్టాలిన్, మురాల రాజేష్, విప్పర్తి నన్ని, పల్లేరు వెంకటస్వామి, కేతా వాసు, కేతా రాము తదితరులు ఉన్నారు

భూములు పరిశీలిస్తున్న సూర్యతేజ

ఫ్లెక్సీలపై నిషేధం ఆపాలని వినతి

ప్రజాశక్తి - తణుకురూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఫ్లెక్సీలపై నిషేధాన్ని ఆపి ఉత్పత్తిదారులను, కార్మికులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఫ్లెక్సీ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చిన్నపాటి ఉత్పత్తిదారులను, కార్మికులను రోడ్డున పడేసే రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఆపాలన్నారు. ఫ్లెక్సీ ఉత్పత్తిదారులు మిషనరీ మార్పు కోసం కొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినా అనుమతి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం కొంత సమయం ఇచ్చి, సబ్సిడీపై మిషనరీ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాయు, జల, పరిశ్రమల కాలుష్యంపై ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అడ్డగర్ల అజయకుమారి, పీడీ.మూర్తి, శేఖర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న నేతలు

దాతలచే వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజల దాహార్తిని తీర్చేందుకు శుద్ధి జలాల ప్లాంట్‌ను దాతలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం స్థానిక రామాలయం వద్ద అనంతపల్లి ఫణి 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సతీమణి ఝాన్సీ, కుమార్తెలు లక్ష్మీ హరిప్రియ, విష్ణుప్రియ సుమారు రూ.నాలుగు లక్షలు వెచ్చించి శుద్ధి జలాల ప్లాంటును ఏర్పాటు చేశారు. ఆ ప్లాంట్‌ను ముదునూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి మహోత్తర సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో అనంతపల్లి హరినాథ్ బాబా, రామ నాగేశ్వరరావు, అనంతపల్లి గోపాలకృష్ణ, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉపసర్పంచి బోణం నరసింహారావు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో 230 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పత్రాలను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. పెదఅమిరంలో భూసేకరణ కష్టంగా మారడంతో కోలనపల్లి గ్రామంలో భూసేకరణ చేశారు. అయితే కోలనపల్లి గ్రామస్తులు స్థానికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. మూడు నెల క్రితం కోర్టు నుంచి తీర్పు రావడంతో సోమవారం పెదఅమిరంలో ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పి.శిరీష విశ్వనాధరాజు, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, గ్రామ సర్పంచ్ దొక్కు సోమేశ్వరరావు, ఉపసర్పంచ్ జవ్వాది కిషోర్, సర్పంచు ముషిన్ పాల్గొన్నారు.

భీమవరం డిపో మేనేజర్‌గా గిరిధర్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా ఎస్.గిరిధర్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆర్‌టిసి వాణిజ్య విభాగంలో పనిచేస్తున్న ఆయన డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వీరయ్య చౌదరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భీమవరం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న వి.నరసింహమూర్తి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ఎటిఎం వాణిజ్య విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గిరిధర్ కుమార్ మాట్లాడుతూ గతంలో భీమవరంలో పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు.

జిల్లా ప్రజా రవాణా అధికారి వీరయ్య చౌదరితో డిపో మేనేజర్ గిరిధర్ కుమార్



నూతనంగా ఎన్నికైన ఎస్‌వికెపి పాలకవర్గ సభ్యులు

ఎస్‌వికెపి నూతన పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పెనుగొండ

ఎస్‌వికెపి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నూతన పాలక వర్గ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ వైవివి అప్పారావు తెలిపారు. ఎస్‌వికెపి విద్యాసంస్థల పాలకవర్గ అధ్యక్షులుగా పితాని సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా తాడి నాగిరెడ్డి, నూలి లక్ష్మణస్వామి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా కలిదిండి రామచంద్ర రాజు, సంయుక్త కార్యదర్శిగా సూర్నీడి రామకోటేశ్వరరావు, పెన్మత్స వెంకట సుబ్రహ్మణ్యం రాజు, కోశాధికారిగా పుర్రెడి లవకుమార్, కోఆప్షన్ సభ్యులుగా గ్రంధి లక్ష్మీనారాయణ, తాడి సాయి నాగేశ్వర్, బాపిరెడ్డి, నాగేశ్వరరావు, పిల్లి వెంకటసత్తిరాజు, పెన్మత్స సుబ్బరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అప్పారావు తెలిపారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వరూప్

బిపి, సుగర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యలమంచిలి

బిపి, షుగర్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని యలమంచిలి పిహెచ్‌సి డాక్టర్ వి.స్వరూప్ సూచించారు. సోమవారం చించినాడ హెల్త్ సెంటర్లో స్వరూప్ ఆధ్వర్యంలో యలమంచిలి పిహెచ్‌సి సిబ్బంది గ్రామంలోని సుమారు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ స్వర్ణలత, ఎఎన్ఎం డి.కనకదుర్గ, ఎంఎల్‌హెచ్‌పి శాంతి, హెల్త్ సూపర్‌వైజర్ జె.కృష్ణ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రావిపూడి మరణం తీరని లోటు

ప్రజాశక్తి - వీరవాసరం

భారత హేతువాద సంఘం ఛైర్మన్ రావిపూడి వెంకటాద్రి మరణం తీరనిలోటని ఏపి జనవిజ్ఞాన వేదిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో మూఢ నమ్మకాలను పారద్రోలడంలో నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన రచనల ద్వారా ఎంతో మందిని అభ్యుదయ భావాల వైపు పయనింపజేసిన మేధావని తెలిపారు.

నేడు భీమవరంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

హాజరుకానున్న కేంద్ర మంత్రులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 24న భీమవరంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరగనున్నాయని బిజెపి నేతలు పాకా సత్యనారాయణ, బిట్రా శివన్నారాయణ, భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. సోమవారం యూత్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశాలకు ఐదుగురు కేంద్ర మంత్రులు రానున్నారన్నారు.

'లోకేష్ పాదయాత్రను అడ్డుకుంటే సహించబోం'

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 27వ తేదీన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన పాదయాత్రను అడ్డుకుంటే సహించేది లేదని పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల శ్రీరాములు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆచంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు, విపక్షాల గొంతు నొక్కేందుకు వైసిపి ప్రభుత్వం జిఒ ఒకటి తీసుకొచ్చిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 341 రోజులు పాద యాత్ర చేసిన సంగతి మర్చిపోయారా అని అన్నారు. జగన్‌కు పుర్తిస్థాయిలో భద్రత కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, తమ్మిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం షోకాజ్ నోటీసు ఇవ్వడంపై ఏపి సంఘం జిల్లా అధ్యక్షులు జిబిఎస్ఎస్.రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చట్టం చేయాలని కోరారు. జిపిఎఫ్, ఎపి జిఎల్ఐలో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన డిఎ, పెన్షనర్లకు రావాల్సిన డిఆర్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పిఎస్ స్థానే వెంటనే జమ చేసిన సొమ్మును ప్రాన్ ఎకౌంట్లో జమ చేసి మెడి క్లెయింలు క్లియర్ చేయాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అంతర్వేది ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

సబ్‌కలెక్టర్ సూర్యతేజ

ప్రజాశక్తి - నరసాపురం

అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామివారి వార్షిక దివ్య తిరుకళ్యాణ మహోత్సవాల్లో యాత్రికులకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాల సందర్భంగా యాత్రికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సబ్ కలెక్టర్ ఆలయ అధికారులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, మత్స్య, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు లక్ష్మీ నరసింహస్వామి తిరుకళ్యాణ మహోత్సవాలు జరుగుతాయన్నారు. శాఖల వారీగా సమీక్షించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని జిల్లాకు, సబ్ కలెక్టరు కార్యాలయానికి నివేదిక అందజేయాలన్నారు. ఈ నాలుగు రోజుల్లో యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నరసాపురం రేవు నుండి వశిష్ట గోదావరి మీదుగా తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి రేవుకు యాత్రికులు చేరుకుంటారన్నారు. అనుమతి ఉన్న ఉభయ గోదావరి జిల్లాల రేవుల పంట్లలో మాత్రమే యాత్రికులు రాకపోకలు సాగించేలా చూడాలని, పంట్లను ఒక్కసారి చెక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేయాలని తెలిపారు. రేవుల వద్ద గజఈతకారులను అందుబాటులో ఉంచాలన్నారు. అత్యవసర మందులతో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను సబ్ కలెక్టరు ఆదేశించారు. తాగునీటికి ఇబ్బంది కలగకుండా వాటర్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలన్నారు. పడవల రేవు వద్ద అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. 60 బస్సు సర్వీసులు నడుపుతున్నామని ఆర్‌టిసి అధికారులు సబ్ కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి కె.రవి మనోహర ఆచారి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ప్రసాద్, తహశీల్దార్ ఎంఎస్ ఫాజిల్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సూర్యతేజ

మరో 25ఏళ్లు వైసిపిదే అధికారం : మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాపల్లిగూడెం

రాష్ట్రంలో మరో 25 ఏళ్లు వైసిపిదే అధికారం అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీని ప్రతి ఇంటికీ తీసుకెళ్లే విధంగా కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థను రూపొందించారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పరంగా కన్వీనర్లు గృహ సారథులు అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని, పార్టీ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రబాబు నాయుడు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ఇబ్బందులు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. తండ్రిని మించిన తనయుడుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాస్, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, పెంటపాడు ఎంపిపి దాసరి హైమావతి పాల్గొన్నారు.

జగన్ పాలనలో నూరుశాతం సంక్షేమ పథకాలు అమలు

ప్రజాశక్తి - పెనుగొండ

జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు నూరుశాతం లబ్ధిదారులకు అందుతున్నాయని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు అన్నారు. సోమవారం పెనుగొండ శివారు చిన్నవారిపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పి.గోవర్ధన్, ఎంపిటిసి పోతినేడి వెంకటేశ్వరరావు బాపిరెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : వరిధనం గ్రామంలో సోమవారం 113వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుణ్ణం నాగబాబు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, చందక సత్తిబాబు, ఎఎంసి ఛైర్మన్ చాలా నరసయ్య పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

ప్రభుత్వ భూముల ఆక్రమణ..!

చేపల చెరువులుగా మార్చి లీజుకు - వైసిపి గ్రామ అధ్యక్షులు వేగేశ్న బాల గణపతివర్మ ఆరోపణ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాతల్లమెరకలో కొంతమంది భూస్వాములు జిరాయితీ భూమికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి చేపల చెరువులుగా తవ్వేసి లీజుకిస్తున్నారని వైసిపి గ్రామ అధ్యక్షులు వేగేశ్న బాల గణపతివర్మ ఆరోపించారు. ప్రాతల్లమెరకలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబరు 33లో పుంత, బండి దారిని ఆక్రమించి సుమారు ఎకరన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చేపల చెరువుగా మార్చేశారన్నారు. గత 30 సంవత్సరాల నుంచి ఎకరన్న ప్రభుత్వ భూమి భూస్వాముల ఆధీనంలో ఉందన్నారు. సర్వే నెంబరు 50లో సుమారు 20 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి చెరువుగా మార్చేసి చెరువులను లీజ్‌కు ఇస్తున్నారని తెలిపారు. ఎకరం చేపల చెరువును రూ.1.50 లక్షలకు లీజుకిచ్చి భూస్వామి లబ్ధి పొందుతున్నాడని తెలిపారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించకుంటే సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి ఎం.ప్రశాంత్ బాబును వివరణ కోరగా సర్వే నెంబర్ 33లో ప్రభుత్వభూమి పుంత బండి దారిగా ఉందన్నారు. ప్రాతాల్లమెరక గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయని, ఆక్రమణల జాబితా తయారు చేసే పనిలో ఉన్నామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నివేదికను అందిస్తామన్నారు.

ఘనంగా లోకేష్ పుట్టినరోజు

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక యువత ఇబ్బందులు పడుతున్నారని శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్, టిడిపి నేత వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. బొండాడలో భోగేశ్వర, జనార్ధనస్వామి ఆలయంలో సోమవారం నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 27 నుంచి జరగనున్న యువగళం పాదయాత్ర జెండాను కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తగ్గేది లేదన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ మంతెన రామరాజు త్వరగా కోలుకోవాలని భోగేశ్వర, జనార్ధనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లు గుడాల శివన్నారాయణ, శ్రీను, టిడిపి నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

కాళ్ల :యువగళం పాదయాత్ర జెండాను ఆవిష్కరిస్తున్న వీరవల్లి శ్రీనివాస్, నేతలు

భీమవరం రూరల్: టిడిపి భీమవరం నియోజకవర్గ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు గంటా త్రిమూర్తులు, మద్దుల రాము ఆధ్వర్యంలో భీమవరం గునుపూడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రికులకు అల్పాహార ప్యాకెట్లు అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి టిడిపి నాయకుడు చిరుకూరి రామకృష్ణచౌదరిచే కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీతారామలక్ష్మి మాట్లాడారు. జగన్ అరాచక పాలనపై లోకేష్ తనదైన శైలితో పోరాడుతున్నారన్నారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాల ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టిడిపి నాయకులు మామిడిశెట్టి ప్రసాద్, రేవు వెంకన్న పాల్గొన్నారు.

ఆచంట : నారా లోకేష్ పుట్టినరోజును తెలుగు యువత మండల అధ్యక్షుడు కేతా మురళీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి లోకేష్ చేపట్టనున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మద్దింశెట్టి వెంకటేష్, నియోజవర్గ ప్రధాన కార్యదర్శి బాలం రమణ, పెనుగొండ మండల అధ్యక్షులు మండా ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్రంలో వైసిపి నుంచి తిరిగి పోటీ చేయడానికి ఎంఎల్‌ఎలు వెనుకంజ వేస్తున్నారని ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చెప్పారు. లోకేష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో వికలాంగులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగర, ఎంఎల్‌ఎ నిమ్మల మాట్లాడారు. సభలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిచ్చెట్టి బాబు, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు గౌడ్ నాయుడు పాల్గొన్నారు.

ఉండి : నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు సోమవారం శివ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహదేవపట్నంలోని సుగుణ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గొట్టుముక్కల సత్యవర్మ, నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బురిడి రవిబాబు మాట్లాడారు. శివ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత, ఉండి మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు ఆదేశాల మేరకు తాము సుగుణ ఫౌండేషన్ వారి సన్ రైజ్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజన సదుపాయాలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు, టిడిపి శ్రేణులకు తినిపించారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు వాణి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మోపిదేవి నాగ శ్రీనివాస్, డి.రాంబాబు, గంధం బుజ్జి, వి.సుజాత పాల్గొన్నారు.

మొగల్తూరు : నారా లోకేష్ పుట్టినరోజును టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు కోసి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.కుమార్ బాబు, మామిడి శెట్టి సత్యనారాయణ, బస్వాని ఏడుకొండలు పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులో నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరు ఠాగూర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసరాజు, మాధవ, రెడ్డి శ్రీను, క్రొవిడి దుర్గ పాల్గొనారు.

జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణానికి సంబంధించి వేంద్ర వెళ్లేదారిలో నిర్మాణం జరుగుతున్న జగనన్న కాలనీకి, అలాగే గునుపూడి లేఅవుట్‌లోని జగనన్న కాలనీకి సంబంధించి రెండు సెమీ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.నాలుగు కోట్ల చొప్పున రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లకు రూ.ఎనిమిది కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే వీటి నిర్మాణాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇఇ పీర్ అహ్మద్ ఖాన్, ఎడి రాజగోపాల్ చౌదరి, ఎఇలు నరసయ్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ఛాంబర్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఎం.గాయత్రి, మొదటి సంవత్సరం చదువుతున్న కె.విష్ణుశ్రీ సూర్యప్రియ స్థానిక డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పట్టణ స్థాయి చెస్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయా విద్యార్థులను కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, సెక్రెటరీ కలిదిండి రామరాజు, పిడి బండారు అప్పారావు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. సోమవారం నేతాజీ జయంతిని పురస్కరించుకుని కొడమంచిలి హైస్కూల్లోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయని ఇటువంటి మహనీయులను స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొమ్మేటి రాంబాబు, స్కూల్ మాజీ ఛైర్మన్ పి.శేఖర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు : జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ సేవలు మరువలేనివన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఉపాధ్యాయులు త్రిమూర్తులు, చంద్రకళ పాల్గొన్నారు.

సేల్స్ ఆఫీసర్లతో సమీక్షిస్తున్న డిసిసిబి సిఇఒ శ్రీదేవి

51 మందికి జప్తు నోటీసులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సొసైటీలో 51 మందికి జప్తు నోటీసులు అందజేశామని డిసిసిబి సిఇఒ శ్రీదేవి ఆదేశించారు. పెనుమంట్ర సొసైటీలో సోమవారం సేల్స్ ఆఫీసర్లతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసిబి సిఇఒ శ్రీదేవి మాట్లాడుతూ సొసైటీలో రూ.20 కోట్ల 21 లక్షలను స్వాహా చేసిన వారిపై దర్యాప్తు ముమ్మరం చేసి సేల్స్ ఆఫీసర్లు రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తణుకు సబ్ డివిజనల్ కోఆర్డినేటర్ ఆఫీసర్ పిఎస్‌సి పెరిశెట్టి నాగేశ్వరరావు, సేల్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవీ కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం వాసవీ మాత ఆత్మార్పణం చేసుకున్న రోజును పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ మహిళలు వాసవీ మాతకు కుంకుమ, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను యువజన సంఘ సభ్యులు పర్యవేక్షించారు.

మేడిది జాన్సన్‌కు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

ఇటీవల మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా మేడిది జాన్సన్ నియమితులైన సందర్భంగా వేంపాడు గ్రామంలోని లూథరన్ చర్చిలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సత్కార సభ చర్చిలో పీటర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమవరం బార్ కౌన్సిల్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, సంఘ పాస్టర్ డి.లాజరస్, సిఆర్‌పి పీటర్, ఎంపిపి పెనుమత్స శిరిష విశ్వనాధరాజు పాల్గొన్నారు.

బాధితునికి కొవ్వలి ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - నర్సాపురం

కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు సేవలందించడంతోపాటు, విద్య, వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తున్నామని ఫౌండేషన్ సభ్యులు సంకు భాస్కరనాయుడు అన్నారు. రుస్తుంబాద కొత్తకాలనీకి చెందిన చేగొండి నాగ శ్రీనివాసరావు పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. శ్రీనివాసరావు ఆరోగ్య, ఆర్థిక పరిస్థితిని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు తెలుసుకుని అతనికి అవసరమైన మందులను కుటుంబ సభ్యులకు భాస్కరనాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర నాయుడు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే లక్ష్యంతో రామ్మోహన్నాయుడు కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేశారన్నారు. వేల మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, వందలాది మందికి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు కళ్లజోళ్లు, మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నంద్యాల బాబు, నిమ్మకాయల బాబ్జీ పాల్గొన్నారు.

మహనీయుడు ఉమర్ అలీషా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళాభ్యుదయం కోసం పాటుపడిన మహనీయుడు, పూర్వ పీఠాధిపతి ఉమర్ అలీషా అని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ అలీషా అన్నారు. ఉమర్ అలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో భీమవరంలోని జువ్వల పాలెం రోడ్డులో ఉన్న ఆనంద్ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన ఉమర్ అలీషా వర్ధంతి సభకు అలీషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే సాహితీ సేవ ప్రారంభించిన మహనీయుడు ఉమర్ ఆలీషా అని తెలిపారు. ఉమర్ అలీషా సాహితీ సమితి ద్వారా అందిస్తున్న హుస్సేన్ షా కవి స్మారక సాహితీ పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన సాహితీ సేవకుడు సత్యవోలు లలిత కృష్ణ ప్రసాదరావుకు, ఉమర్ అలీషా కవి పురస్కారాన్ని సాహితీ విశ్లేషకుడు అమెరికాకు చెందిన కిరణ్ ప్రభకు అందజేశారు. అనంతరం పీఠాధిపతి ఉమర్ అలీషా పురస్కార గ్రహీతలకు స్మారక పురస్కారాలను, ఇద్దరికీ 25,116 రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి డి.సురేష్ చంద్రాజీ, ఉపాధ్యక్షుడు త్సవటపల్లి మురళీకృష్ణ, కోశాధికారి శ్రీవెంకటేశ్వర శర్మ పాల్గొన్నారు.

Before the motor accidents claims tribunal-cum-xvi additional district judge court at Nandigama NTR district,a.p.
Mvop no 11/2020
Between
Dasu Prabhakar rao and other ... Petitioners
And
1.kunsoth venkateswarao ...R1
2. Ragolu Naga Raju ...R2..Respondents
To,
R2 Ragolu Naga Raju, S/o Dallaiah, 33years, Car Mechanic & owner of motor cycle AP04BE2226 R/o,Jangareddygudem (Town & Mandal),West Godavari district. A.P. Owner of motor cycle AP04BE2226.
Please take notice that the above name petitioners got field. The above petition MVOP 11/2019 for compensation. Against you and another and same stands posted to 2-2-2023 for your appearance there. For you here by directed by this notice to attend. Before this court as the said date at 10.30 am. Either in person or through your advocate, to answer the claim. Else the matter will be decided in your absence.
(By order of the court)
Sd/-
Bondalapati ramakrishna,
BSc,LLB,
Advocate, Nandigama.